క్లుప్తంగా

శుభకార్యం



సి.బెళగల్: కర్నూలులో జరిగిన ఇనగండ్ల గ్రామ సర్పంచ్ ఇమ్మానియేల్ కుమార్తె వివాహ వేడుకకు కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, పార్టీ డాక్టర్ల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ముల్లా హారున్ తదితరులు హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న మత్స్యశాఖ అధికారులు

పాణ్యం: మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు హిరా నాయక్ అన్నారు. బుధవారం పాణ్యంలోని మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో మత్స్యకారులకు జిల్లా స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మత్స్య సంపద సృష్టి.. సహకార సంఘాల పాత్ర తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సహకార సిబ్బంది రాములు, రషీద్, ఫక్రుద్దీన్, చక్రవర్తి, శివకుమార్, ఉయద కుమార్, నంద్యాల జిల్లా బెస్త సంఘం అధ్యక్షుడు రామచంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ అనంతయ్య

కోడుమూరు రూరల్: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా చూడాలని ఎంఈఓ అనంతయ్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం అనుగొండ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వండి పెట్టాలని నిర్వాహకులకు సూచించారు.

వ్యక్తిపై హత్యాయత్నం



దాడిలో గాయపడిన కురువ నాగులు

కర్నూలు రూరల్: మండల పరిధిలోని నిడ్జూరు గ్రామం బీసీ కాలనీలో నివసిస్తున్న కురువ నాగులుపై అదే గ్రామానికి చెందిన కొందరు హత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితుడి భార్య శివలక్ష్మి తెలిపిన వివరాలు.. కురువ నాగులు బుధవారం సాయంత్రం తన కుమార్తెతో కలిసి బైక్‌పై ఇంటికి వస్తుండగా కరెంట్ డిపో ప్రాంతంలో తన వైపు ఎందుకు చూస్తున్నావంటూ అదే గ్రామానికి చెందిన లాలూ వాగ్వాదానికి దిగాడు. ఈక్రమంలో లాలూతోపాటు అతని సోదరులు కర్రలతో విచక్షణా రహితంగా దాడి చేశారు. సమీపంలో ఉన్న నాగులు భార్య శివలక్ష్మి, అతని మామ అడ్డురాగా వారిపై కూడా దాడి చేశారు. నాగులు గాయపడి స్పృహ తప్పి పడిపోగా స్థానికులు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఓర్వకల్లు: వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆశించిన మేర దిగుబడులు సాధించవచ్చని డాట్ సెంటర్ శాస్త్రవేత్త సుజాతమ్మ అన్నారు. బుధవారం మండలంలోని హుసేనాపురం, లొద్దిపల్లె గ్రామాల్లో రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి మధుమతి ఆధ్వర్యంలో ఆయా రైతు సేవా కేంద్రాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి శాస్త్రవేత్త సుజాతమ్మ, డీఆర్‌సీ ఏడీఏ వేదమణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణకు పంట వేసిన 25 రోజులకు మందు పిచికారీ చేయాలని సూచించారు. ఏడీఏ వేదమణి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈఓలు భాస్కర్, మధు, వీఏఏలు మాధవీలత, దేవకుమార్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి ఇంకెప్పుడు?

- ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.3 వేలు ఇస్తామని కూటమి సర్కారు హామీ
- అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా పట్టించుకోని వైనం
- పాణ్యం నియోజకవర్గంలో 20వేల మందికి పైగా నిరుద్యోగులు
- ఇచ్చిన మాట ప్రకారం భృతి ఇవ్వాలని డిమాండ్



గ్రామాల్లో ఎన్నికల సమయంలో కూటమి నాయకులు పంచిన ఎన్నికల మేనిఫెస్టో

గడివేముల: ఏరు దాటాక తెప్ప తగలేయడంలో సీఎం చంద్రబాబుది అందెవేసిన చేయి. ఎన్నికల సమయంలో బూటకపు హామీలు గుప్పించడం.. అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని అమలు చేయకుండా ప్రజలను వంచించడం ఆయన నైజం. 2014లో ఇదే తరహా పాలన సాగించడంతో ప్రజలు 2019 ఎన్నికల్లో చిత్తుగా ఓడించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవాలన్న తలంపుతో జనసేన, బీజేపీతో కూటమి కట్టి సూపర్ సిక్స్ పేరుతో ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఎన్నికల హామీలను అమలు చేయడం లేదు. తాను ఇచ్చిందే తీసుకోవాలన్న చందంగా ప్రజలను దగా చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే తల్లికి వందనం పథకం కింద అరకొరగా డబ్బులు వేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే చదువుకున్న నిరుద్యోగులకు యువగళం నిధి కింద ఉద్యోగం వచ్చేంత వరకు నెలకు రూ.3 వేలు భృతి ఇస్తామని ఎన్నికల్లో ప్రకటించారు. ఏడాది దాటినా ఇంత వరకు నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. చివరకు వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా కల్పించడం లేదు. పాణ్యం నియోజకవర్గంలో 20 వేలమందికి పైగా డిగ్రీ ఆపై చదువు చదువుకున్న నిరుద్యోగులు ఉన్నారు. వీరంతా కూటమి సర్కారు ఇస్తానన్న నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నారు.

భృతి ఎప్పుడు ఇస్తారో చెప్పాలి



నేను 2017 సంవత్సరంలో డిగ్రీ పాసై 2021లో పీజీ పూర్తి చేశాను.అప్పటి నుంచి నిరుద్యోగిగా ఉన్నాను. 2014 ఎన్నికల హామీల మాదిరి కాకుండా త్వరితగతిన నిరుద్యోగ భృతి ఇవ్వాలి. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మాకు ఉద్యోగం వచ్చేంత వరకు రూ.3 వేలు ఇస్తానన్నారు. ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయడంతో పాటు జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలి. –దొమ్మరి అజయ్, నిరుద్యోగి,

ఎన్నికల హామీ అమలు చేయాలి



నేను 2012లో డిగ్రీ పాసయ్యాను. టీటీసీ పూర్తి చేయడంతో పాటు ఎంఏ పీజీ పూర్తి చేశాను. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చేంత వరకు యువగళం నిధి కింద నెలకు రూ.3 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇంత వరకు నిరుద్యోగ భృతి ఊసేలేదు. ఇప్పటికైనా ఆ హామీని అమలు చేసి మాట నిలబెట్టుకోవాలి. –యాసిన్ బాషా, గడివేముల

అధ్వానంగా సంక్షేమ హాస్టళ్లు



విద్యార్థులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు మణిరెడ్డి

కల్లూరు: కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమ హాస్టళ్లు అధ్వానంగా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు జి. మణిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆ విభాగం కల్లూరు కమిటీ నాయకుల ఆధ్వర్యంలో పెద్దపాడు గ్రామంలో ఉన్న బీసీ హాస్టల్ సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో ఉన్న సమస్యలు పరిశీలించారు. విద్యార్థులతో సమావేశమై వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ ఆవరణలో పందులు, కుక్కలు సంచరిస్తున్నాయని, తాగునీరు, ఫ్యాన్లు తదితరవి లేవని విద్యార్థులు వాపోయారు. అనంతరం మణిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి కిట్‌లో ఇచ్చిన బ్యాగుల నాణ్యత లేకపోవడంతో చిరిగిపోతున్నాయన్నారు. హాస్టళ్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి త్వరలో ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు బి. మధుమోహన్, నాయకులు హేమంత్, దీపు, అమీర్, కృష్ణ, నౌషాద్, తదితరులు పాల్గొన్నారు.

నన్నూరు హైస్కూల్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. బుధవారం నన్నూరు హైస్కూల్‌ను సీపీఎం బృందం సందర్శించింది. విద్యార్థులకు తయారు చేసిన మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. అదే విధంగా అక్కడ నెలకొన్న ప్రహరీ, క్రీడా మైదానం, మరుగుదొడ్లు, బాతురూమ్‌లు తదితర సమస్యలపై ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో దాదాపు 800 మంది విద్యార్థులు ఉంటే వారికి సరిపడా గదులు లేవన్నారు. హిందీ, ఉర్దూ టీచర్ల కొరత పిల్లలకు వేధిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మధుసూదన్, పార్టీ సభ్యులు మహేష్, మాసూం బాషా, శేషన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల గోడు సర్కారుకు పట్టదు



పిగిలి పోయిన బ్యాగులు చూపుతున్న విద్యార్థి నాయకులు

ఓర్వకల్లు: కూటమి సర్కారుకు హాస్టల్ విద్యార్థుల గోడు పట్టడం లేదని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సాయికుమార్ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన ‘సంక్షేమ హాస్టల్ బాట’ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని లొద్దిపల్లె బీసీ హాస్టల్‌ను ఆయన సందర్శించారు. హాస్టల్ విద్యార్థులతో మమేకమై హాస్టల్ గదులు, వంటగది, పరిసరాలు, మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హాస్టల్ పైకప్పు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉందన్నారు. దీంతో విద్యార్థులు భయపడుతూ సమీపంలోని సచివాలయ భవనంలో తలదాచుకుంటున్నట్లు తెలిపారు. హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బాతురూములు, మరుగుదొడ్లు లేకపోవడంతో బహిర్భూమికి ఆరుబయటకు వెళ్లాల్సిన దౌర్భాగ్య పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అధికారులు స్పందించి హాస్టల్‌కు నూతన భవనం మంజూరుతో పాటు విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం పేద పిల్లలకు ఇచ్చిన స్కూల్ బ్యాగ్‌లు నాణ్యత లేకపోవడంతో కొద్ది రోజులకే అవి పిగిలిపోతున్నాయని చెప్పారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శి కురువ రంగన్న, విద్యార్థి నాయకులు గిరీష్, రంగనాథ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

11న యోగా టోర్నమెంట్

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని యోగా హాలులో ఆగస్టు 11న జిల్లా స్థాయి యోగా టోర్నమెంటు కమ్ సెలక్షన్లు నిర్వహించనున్నట్లు జిల్లా యోగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అవినాష్ శెట్టి, మునిస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీల్లో 8 నుంచి 45 ఏళ్ల బాలబాలికలు, స్త్రీ, పురుషులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఎంపికై న క్రీడాకారులు ఆగస్టు చివరి వారంలో పశ్చిమ గోదావరి జిల్లాలో నిర్వహించనున్న 50వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, సీనియర్స్ బాలబాలికల యోగా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 77320 89440 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

2న నగరపాలక సర్వసభ్య సమావేశం

కర్నూలు (టౌన్): ఆగస్టు 2న నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, మంత్రి టీజీ భరత్, ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు గౌరు చరితా రెడ్డి, బొగ్గుల దస్తగిరి, డిప్యూటీ మేయర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కో–ఆప్షన్ సభ్యులు, కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు.

నష్టపరిహారం ఇవ్వాలి

- సోలార్ పరిశ్రమలో భూములు కోల్పోయిన గిరిజన రైతులు ఆందోళన



సోలార్ వద్ద అందోళన చేపట్టిన గిరిజన రైతులు

గడివేముల: మండల పరిధిలోని ఒండుట్ల,పైబోగుల గ్రామాల మధ్య నిర్మిస్తున్న సోలార్ ప్రాజెక్టులో భూములు కోల్పోయిన తమకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తుందని బాధిత గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వారు సోలార్ పరిశ్రమ వద్ద అందోళన చేపట్టారు. జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ మాట్లాడుతూ గత కొన్ని రోజుల కిందట గిరిజనుల భూములను పరిశ్రమ కోసం తీసుకున్నారన్నారు. అయితే, వారికి ఇప్పటి వరకు పరిహారం ఇవ్వలేదన్నారు. ఇదిలా ఉంటే జాతీయ ఎస్టీ కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం తహసీల్దార్ వెంకటరమణ సిబ్బందితో కలిసి గిరిజనుల భూములు వద్దకు వచ్చి సర్వే చేశారు. పూర్తి నివేదికలను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో రైతులు బద్దు నాయక్, సామే నాయక్, జీవుల నాయక్, హిమీబాయి, వెంకట రాముడు, స్వామి నాయక్, సీతమ్మ బాయి, బాబు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ప్యానల్ కేబుల్స్ చోరీ

గడివేముల: మండల పరిధిలోని ఒండుట్ల గ్రామ సమీపంలో నిర్మిస్తున్న సోలార్ ప్రాజెక్టులో సోలార్ ప్యానల్స్ కేబుల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారు. ఈఘటనపై హెచ్ఆర్ డిపార్ట్‌మెంట్ మేనేజర్ కళాయి చిన్న మస్తాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి బుధవారం విలేకరులకు వెల్లడించారు.

పేదల సంక్షేమానికి ప్రాధాన్యత

కల్లూరు: పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పాణ్యం ఎమ్మెల్యే గౌర చరితారెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు 19వ వార్డు పరిధిలోని నంద్యాల చెక్‌పోస్టు సర్కిల్ వద్ద నూతన అన్న క్యాంటీన్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కమిషనర్ విశ్వనాథ్ ముఖ్య అతిథులుగా హాజరై నిర్మాణ పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల కడుపు నింపాలనే ఆలోచనతో ప్రభుత్వం అన్న క్యాంటీన్లకు శ్రీకారం చుట్టిందన్నారు. అనంతరం ఆమె నగరంలోని రావూరి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కల్లూరు పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ, పీఏసీఎస్ చైర్మన్‌గా శేఖర్ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

వేతనాలు జమ అయ్యేలా చూడాలి

సి.బెళగల్: ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులకు వేతనాలు ఎప్పటికప్పుడు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఏపీడీ రామన్న సిబ్బందికి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన హౌసింగ్ ఏఈ సుమంత్, జేఈ రంగస్వామిలతో కలిసి ఉపాధిహామీ టీఏలు, ఎఫ్ఏలు, సిబ్బందితో పనుల నిర్వహణ, వేతన చెల్లింపులపై సమావేశం నిర్వహించారు. పండ్లు, పూల తోటల రైతులకు చెందిన వేతన చెల్లింపులు బిల్లులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేసి, ప్రతినెలా జమ అయ్యేలా చూడాలని ఆయన సూచించారు. పూర్తయిన మినీ గోకులాలు, పశువుల తొట్ల పనులకు బిల్లుల చెల్లింపులు, హౌసింగ్‌లో 90 రోజుల పనిదినాల వేతనాల మస్టర్ పేమెంట్లు పూర్తి చేయాలన్నారు.

గళ్ల పరీక్షలు చేయించుకోండి

సి.బెళగల్: జ్వరం, దగ్గు ఉన్న వాళ్లు గళ్ల పరీక్షలు చేయించుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు మిథున్ కుమార్ రెడ్డి సూచించారు. బుధవారం టీబీ విముక్త్ కార్యక్రమంలో భాగంగా తిమ్మదొడ్డి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి 59 మందికి గళ్ల పరీక్షలు నిర్వహించారు.

ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ 60 ఏళ్ల పైబడి వయస్సు ఉండి, బీపీ, షుగర్, ఆయాసం, దగ్గు లక్షణాలు ఉన్న వారు కచ్చితంగా గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారు క్రమం తప్పకుండా ఆరు నెలల పాటు మందులు వాడితే నయం అవుతుందన్నారు. కార్యక్రమంలో టీబీ డివిజన్ సూపర్‌వైజర్ నాగమహేంద్ర, హెల్త్ సూపర్‌వైజర్ మంగమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ హేమాలత, ఏఎన్ఎం మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

గులాబీరంగు పురుగు నివారణకు చర్యలు తీసుకోండి

- ఏడీఏ సాలురెడ్డి



రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ సాలురెడ్డి

సి.బెళగల్: పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని కర్నూలు ఏడీఏ సాలురెడ్డి రైతులకు సూచించారు. బుధవారం బ్రాహ్మణదొడ్డి గ్రామ పరిధిలోని పొలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మల్లేష్‌కుమార్‌తో కలిసి పత్తి పంటలను పరిశీలించి, సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం గ్రామంలో రైతులతో సమావేశమై ఎరువులు, నానో యూరియా వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి మదన్‌మోహన్, ఏఈఓ హిమబిందు పాల్గొన్నారు.

- కోడుమూరు రూరల్: ఖరీఫ్ కింద సాగు చేసిన పత్తి పంటకు ప్రధానంగా సోకే గులాబీరంగు పురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ సూచించారు. బుధవారం కోడుమూరులో ఏఓ రవిప్రకాష్ రైతులతో కలిసి పత్తి, కంది పంటల సాగుపై ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ పత్తి పంట సాగు చేసిన రైతులంతా ప్రతి రోజు పంటను పరిశీలిస్తూ ఉండాలని, రసం పీల్చే పురుగు, దోమగాని కన్పించిన యడల సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ఖరీఫ్ కింద పంటలు సాగు చేసిన రైతులంతా తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు.
- గూడూరు మండలం పెంచికలపాడు, గుడిపాడు గ్రామాల్లో ఏఓ దస్తగిరి రెడ్డి బుధవారం ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి పంటకు సోకే తెగుళ్లు, గులాబీ రంగు పురుగు నివారణకై రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏఓ వివరించారు.

పంట నమోదు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి

కల్లూరు: రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని శాస్త్రవేత్త రవి కిషోర్, మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. బుధవారం తడకనపల్లె, బస్తిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ ఎన్‌పీసీఐ కాని రైతుల జాబితాను రైతు సేవ కేంద్రాల్లో ప్రచురించాలని వీఏఏ/వీహెచ్ఏ/ఎంపీఈఓలకు సూచించారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను ప్రతి రైతు నమోదు చేసుకోవాలన్నారు. ఇది పంట కొనుగోలుకు, ప్రభుత్వ పథకాలు లబ్ధికి ఉపయోగపడుతుందన్నారు.

పక్కాగా సర్వే నిర్వహించాలి



గడివేముల ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

గడివేముల: స్వామిత్వ పథకం కింద చేపట్టే ఇళ్ల సర్వేను నిబంధనల ప్రకారం పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ వాసుదేవ గుప్తా, డిప్యూటీ ఎంపీడీఓ మహీధర్‌రెడ్డి సూచించారు. స్వామిత్వ రీసర్వే కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీర్ సహాయకులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామకంఠం పరిధిలో కట్టిన ఇళ్లు, భూములను, దగ్గరలో ఉన్న ఇళ్లను సర్వే చేసి వారికి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం స్వామిత్వ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. మొదటి విడతలో భాగంగా మంచాలకట్ట, కొరటమద్ది, కొత్రపాలూరు గ్రామాలను ఎంపిక చేసి స్వామిత్వ సర్వే దాదాపు పూర్తికావచ్చిందన్నారు. రెండో విడతలో భాగంగా మండలంలోని మిగతా గ్రామాలను ఎంపిక చేశామన్నారు. పథకం ద్వారా ప్రతి ఇంటికి యాజమాన్య హక్కులు కల్పించడం ద్వారా న్యాయబద్ధమైన స్పష్టత లభిస్తుందన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా వైద్య నోడల్ అధికారి రఘు



ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న జిల్లా వైద్య నోడల్ అధికారి రఘు

కర్నూలు(రూరల్): డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని – జిల్లా వైద్య నోడల్ అధికారి రఘు సూచించారు. మండల పరిధిలో సూదిరెడ్డి పల్లె గ్రామంలో నిర్వహిస్తున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు ఆయన సూచించారు. వర్షాకాలం కావడంతో నీరు కలుషితమై డయేరియా వ్యాధి బారిన పడే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీరు కాచి, వడబోసి, చల్లార్చుకుని తాగాలన్నారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు అబ్దుల్ అనీద్, సామాజిక ఆరోగ్య అధికారి జయ నాగమణి, పీహెచ్ఎన్ హనుమంతమ్మ, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాలు అపరిశుభ్రం.. పట్టించుకునేదెవరు?



తులాశపురం గ్రామ సచివాలయం ముందు నిలిచిన మురుగునీరు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని తులాశపురం గ్రామ సచివాలయం ఎదుట పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నా పట్టించుకునే వారే లేదు. మురుగు కాల్వలో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నా శుభ్రం చేయించే దిక్కులేదు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పే అధికారులు.. తమ కార్యాలయం వద్ద మాత్రం ఆచరించకపోవడం సిగ్గుచేటు. సచివాలయం పక్కనే అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, రైతు సేవా కేంద్రం ఉండటంతో వాటి వద్దకు వచ్చే ప్రజలు పరిసరాలు కంపు కొడుతుండటంతో ముక్కుమూసుకుంటున్నారు. మురుగు నీటిలో దోమలు వృద్ధి చెంది తాము వ్యాధుల బారిన పడుతున్నామని మరోవైపు స్థానికులు వాపోతున్నారు.

ప్రమాదకరంగా వంతెన!



కర్నూలు(రూరల్): మండల పరిధిలోని కర్నూలు–సుంకేసుల వెళ్లే ప్రధాన రహదారిలో ఆర్.కొంతలపాడు వద్ద వాగుపై ఉన్న వంతెన ప్రమాదకరంగా ఉంది. ఈ దారిలో నిత్యం వాహనాల రద్దీ ఉంటోంది. వందలాది వాహనాదారులు రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన ఇరుకుగా ఉండటంతోపాటు, ఇదే ప్రాంతంలో రహదారి కంకర తేలి గుంతలు పడటంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో , వర్షం కురిసనప్పుడు గుంతలు కనపడకపోవడం, కంకర స్కిడ్ అవుతుండటంతో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెనను వెడల్పు చేయడంతోపాటు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



జి.సింగవరం గ్రామ సమీపంలో ట్రాక్టరుతో దమ్ము చేస్తున్న రైతు



నిడ్జూరు సమీపంలో నాటుకు వచ్చిన వరినారు

వరి నాట్లకు సన్నద్ధం!

కర్నూలు(రూరల్): వరి నాట్లకు అదునవుతోంది. నిడ్జూరు, జీ.సింగవరం, ఆర్.కె.దుద్యాల, సుంకేసుల, ఆర్.కొంతలపాడు, మునగాలపాడు, పి.రుద్రవరం, పడిదెంపాడు, పూడూరు తదితర గ్రామాల్లో ఇప్పటికై రైతులు మడులలో చల్లుకున్న వరి విత్తనాల మొలకలు నాటుకు వచ్చాయి. మరోవైపు ట్రాక్టర్లతో పొలాలను దమ్ము చేసి సిద్ధంగా ఉంచుకున్నారు. హంద్రీనీవా, కేసీ కెనాల్ కాలువకు నీళ్లు వదలడంతో ఆయకట్టు కింద ఉన్న వరి నారు మళ్లను అన్నదాతలు కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. మరో 10 రోజుల్లో వరి నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు.